ఉష్ణోగ్రత (అంచనా)

11-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	36	27
నరసరావుపేట	33	26
బాపట్ల	36	26
రెంటచింతల	34	27
చీరాల	36	27

ఎస్జీటీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- రాత్రి వరకు పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు
- మాన్యువల్‌గా నిర్వహణకు యత్నించినా పలు సమస్యలు
- రాత్రి వరకు ఉపాధ్యాయులు పడిగాపులు
- మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ వాయిదా



గుంటూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గందరగోళం.. ఆందోళనలు.. సాంకేతిక సమస్యలు.. వాయిదాల మధ్య సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సా..గుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం చేపట్టేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే రాత్రి 9 గంటల వరకు కూడా సాంకేతిక సమస్యలు ఒక కొలిక్కి రాకపోవడంతో చివరకు బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహణకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి 350 వరకు సీరియల్ నెంబర్‌లోని ఎస్జీటీ తెలుగు ఉపాధ్యాయులు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఖాళీల జాబితా సిద్ధం కాకపోవడంతో రాత్రి 9 గంటల వరకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతోపాటు అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేసినట్లు డీఈఓ రేణుక ప్రకటించారు. దీంతో రాత్రి వరకు ఉపాధ్యాయులు జడ్పీ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు కౌన్సెలింగ్ వాయిదాతో ఉపాధ్యాయులు వెనుతిరిగారు. బుధవారం జరగాల్సిన కార్పొరేషన్, మున్సిపల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను కూడా వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలు..

మండల పరిషత్ పాఠశాలల్లోని ఎస్జీటీ(తెలుగు) ఉపాధ్యాయులకు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సీరియల్ నెంబరు 1 నుంచి 750 లోపు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరగనున్నది.

వ్యవసాయ శాఖలో
బదిలీల జాతర
- గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ
- పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి
- పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం
- 'ఆంధ్రజ్యోతి ' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం
6

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి
- గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు
8

జిల్లాలో అధికారుల బదిలీలు



నరసరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యవసాయాధికారి మురళి ప్రకాశం జిల్లా డీఏవోగా బదిలీ అయ్యారు. మురళి స్థానంలో గుంటూరు డీడీఏ ఎం జగ్గారావు నియమి తులయ్యారు. నరసరావుపేట ఏడీఏ పీ మస్తానమ్మ సత్తెనపల్లికి బదిలీ అయ్యారు. సత్తెనపల్లి ఏడీఏ కే అమలకుమారి నరసరావుపేట ఏడీఏగా నియమితులయ్యారు. వినుకొండ ఏడీఏ బీ రవిబాబును జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నియ మించారు. సీహెచ్ రమాదేవి క్రోసూరు ఏడీఏగా, సీహెచ్ రవి కుమార్ వినుకొండ ఏడీఏగా నియమి తులయ్యారు. బాపట్ల ఏడీఏ కేవీ శ్రీనివాసరావును నరసరావుపేట ఏడీఏగా నియమిం చారు. ఉద్యానశాఖ జిల్లా అధికారిగా ఐ వెంకట్రావు గుంటూరు నుంచి నరసరావుపేటకు బదిలీ అయ్యారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా సీహెచ్ ఆంజనేయులు నియమితులయ్యారు.

- నరసరావుపేట మున్సిపల్ ఇంజనీరు బీ కనకారావును కాకినాడ కార్పొరేషన్ ఈఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. స్థానికంగా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పబ్లిక్‌హెల్త్ చిలకలూరిపేట సబ్ డివిజన్ డీఈ రవికుమార్ ఉద్యోగోన్నతిపై మున్సిపల్ ఇంజనీరుగా బదిలీ కానున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.
- సహకార శాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి ఎం వెంకటరమణ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి డీసీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎం నాగరాజును ఏసీడీఆర్, డీసీవోగా నియమితులయ్యారు.
- నరసరావుపేట ఏఎంసీ ఏడీఎం కే సూర్యప్రకాశ్‌రెడ్డి బాపట్ల జిల్లా అద్దంకి ఏడీఎంగా బదిలీ అయ్యారు. ఒంగోలు ఏడీఎం కేవీఎస్ ఉపేంద్ర నరసరావుపేట ఏఎంసీ ఏడీఎంగా నియమితులయ్యారు. చిలకలూరిపేట ఏఎంసీ కార్యదర్శి యూ యోగేశ్వరరావును ఆకివీడు ఏఎంసీ కార్యదర్శిగా బదిలీ చేశారు. తణుకు ఏఎంసీ కార్యదర్శి డీ తిరుపతిరాయుడును చిలకలూ రిపేట మార్కెట్ యార్డు కార్యదర్శిగా నియమించారు.

తాగునీరు @ 24/7

- గుంటూరు సహా నాలుగు పట్టణాల్లో
- పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు
- రానున్న ఏడాదిలో పథకం ప్రారంభానికి చర్యలు

ఇక పుష్కలంగా నీటి సరఫరా

ఈ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా..


తొలుత కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 24/7 నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరులో వికాస్‌నగర్, తెనాలిలో బస్టాండ్ ఏరియా, నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్, చిలకలూరిపేటలో పండరీపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఆ ప్రాంతాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లను నిర్మించనున్నారు. ఆయా పనులకు టెండర్లు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత 24/7 నీటి సరఫరా చేయనున్నారు.

తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక రోజంతా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే ఆ రోజుకు తాగునీరు పట్టుకోలేమోనని ఆందోళన అవసరం లేదు. వారంలో ఏడు రోజులు.. 24 గంటలు పుష్కలంగా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయమా.. మధ్యాహ్నమా.. సాయం త్రమా.. లేక రాత్రి అన్న తేడా లేకుండా రోజులో ఎప్పుడైనా కుళాయి తిప్పితే తాగు నీరు అందేలా సరఫరాకు చర్యలు చేపట్టింది. గుంటూరు కార్పొరేషన్‌తో పాటు తెనాలి, నరసరావు పేట, చిలకలూరిపేట పట్టణాల్లో 24 గంటల నీటి సరఫరా పథకాన్ని అమలు చేయనున్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. నీటి సరఫరాకు అవస రమైన పనులను గుర్తించారు. ఆయా పనులకు టెండర్ ప్రక్రియ చేపట్టారు. రానున్న ఏడాదిలో ఈ పథకం ప్రారంభించనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎంపిక చేసిన మున్సిపల్ పట్టణాల్లో 24 గంటలు తాగునీటి సరఫరాతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీరిపోనున్నాయి. ఇందుకు మున్సిపాల్టీలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. 24/7 నీటి సరఫరాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ పట్టణాలను ఎంపిక చేశారు. ఈ పట్టణాల్లో 24/7 నీటి (మిగతా 8వ పేజీలో)





నీటి సరఫరాకు ఎంపిక చేసిన నరసరావుపేటలోని ప్రకాశ్‌నగర్



పొలం దుక్కి దున్నుతున్న రైతు

ఏరువాక సాగారో..

- నేడు పుడమిపుత్రుల పండుగ
- సాగు ప్రారంభించనున్న అన్నదాతలు
- మృగశిర కార్తెను స్వాగతిస్తూ వేడుకలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులకు మాత్రమే ప్రత్యేకమైన పండుగ ఏరువాక పౌర్ణమి. ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజున అన్నదాతలు ఏరువాక పౌర్ణమిగా జరుపుకుంటారు. రోహిణి కార్తె వెళ్లి తొలకరి చినుకులను తెచ్చే మృగశిర కార్తె రాకను స్వాగతిస్తూ ఏరువాక పౌర్ణమిని ఆనందోత్సాహాలతో రైతులు శతాబ్దాలుగా జరుపుకుంటారు. పల్లెల్లో కుటుంబ సమేతంగా చిన్నా పెద్ద, కులమతాలకు అతీతంగా కలిసి రైతులు ఎంతో కోలాహలంగా ఏరువాకను పండుగలా జరుపుకుంటారు. పుడమి తల్లిని నమ్ముకుని పంటలు పండించే రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, సమాజం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఏరువాకను వేడుకగా జరుపుకుంటారు. పుడమి.. ప్రకృతిపై భక్తిప్రపత్తులను చాటుకుంటూ రైతులు కుటుంబసమేతంగా ఏరువాక సాగుతారు. జిల్లాలో బుధవారం ఏరువాక పండుగను రైతు కుటుంబాలు ఉత్సాహంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యాయి. పుడమికి పూజలు చేసి సాగును రైతులు ఆరంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంటిల్లపాది పొలం వెళ్లి నవధాన్యాలు చల్లి పూజలు చేయనున్నారు. ఉదయాన్నే ఎద్దులను నీటితో కడిగి వాటి కొమ్ములను రంగులతో, కాళ్లకు గజ్జెలు కట్టి, పూసలు, పూల దండలతో ఎద్దులను అలంకరిస్తారు. ఇళ్లల్లో పొంగలి చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేస్తారు. అనంతరం ఎద్దులకు అరకలు కట్టి మంగళ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపులు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దులను అరకలకు కట్టి తొలుత ఆలయాల్లో పూజలు చేస్తారు. వినాయకస్వామికి ఉండ్రాళ్లు సమర్పిస్తారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. కొన్ని గ్రామాల్లో ఏరువాకను తిరునాళ్లలా జరుపుకుంటారు. ఈ ఉత్సవంలో రైతు కూలీలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొంటారు. ఏరువాక పౌర్ణమి రోజు రైతులు ఎద్దులను, నాగలికి పూజలు చేసి దుక్కి దున్నడం శతాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఏరువాక పౌర్ణమికి పల్లెలు సిద్ధమయ్యాయి.



నేడు గిరిజన గురుకులం ప్రారంభం

- ఏర్పాట్లు చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ
- గిరిజన విద్యపై చోద్యం.. కథనంపై అధికారుల స్పందన

నరసరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెదతురకపాలెం వద్ద నిర్మించిన గిరిజన గురుకుల బాలుర పాఠశాలను బుధవారం ప్రారంభించేందు కు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'గిరిజన విద్యపై చో ద్యం.. ఏడాదిగా ప్రారంభం కాని గురుకులం' శీర్షికతో 4న ఆం ధ్రజ్యోతిలో వెలవడిన కథనంపై సదరు శాఖ ఉన్నతాధి కారులు స్పందించారు. ఎట్టకేలకు పాఠశాల ప్రారం భోత్సవానికి అధికారులు ముహూర్తాన్ని ఖరారు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పాఠశాలను ప్రారంభించనున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ8.20 కోట్లతో పాఠశాల, వసతి భవనాలను నిర్మించారు.



టింబర్ డిపో వద్ద వటవృక్షం


వృక్ష.. విలాపం

- భారీ వృక్షాలు సైతం నరికివేత
- పర్యావరణానికి హాని..
- పట్టించుకోని అధికారులు

మాచర్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వృక్షో రక్షితి.. రక్షతః. అంటే చెట్లను మనం రక్షిస్తే.. అవి మనల్ని, పర్యావరణాన్ని రక్షిస్తాయి. ప్రభుత్వం కూడా విస్తృతంగా మొక్కలను నాటి రక్షించాలని ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అయితే మాచర్ల నియోజకవర్గంలో అక్రమార్కులకు అవేవీ పట్టడంలేదు. కొందరు స్వార్థ పరులు రోడ్ల పక్కన ఉండే భారీ వృక్షాలను అక్రమార్జన కోసం నరికివేస్తున్నారు. మాచర్ల ప్రాంతంలో విస్తారంగా ఉన్న అటవీ భూముల్లో అనేక వృక్ష జాతులకు చెందిన చెట్లు దశాబ్దాల నుంచి ఉన్నాయి. పొలాల గట్లు, రోడ్ల వెంబడి కూడా పెద్దపెద్ద వృక్షాలు ఉన్నాయి. ఈ చెట్లు జనంతో పాటు పశువులకు నీడను, ఆశ్రయం ఇస్తుంటాయి. ఇలాంటి వృక్షాలను రాత్రికి రాత్రి నరికి వాహనాల్లో అడితికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చెట్లను నరకాలంటే చాలా సమయం పట్టేది. అయితే ప్రస్తుతం అధునాతన యంత్రాలు రావడంతో గంటల్లో ఎంత పెద్ద వృక్షమైనా ముక్కలు ముక్కలుగా మారిపోతోంది. చెట్లు కొట్టిన ఆనవాళ్లు కూడా లేకుండా చేసి రాత్రికి రాత్రే ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

కందిపప్పు మిల్లులకు సరఫరా..

వ్యవసాయం యాంత్రీకరణ అయ్యాక చెట్లకు సంబంధించిన పనిముట్లు వాడకం తగ్గిపోయింది. గ్యాస్ పొయ్యిలు రావడంతో కలప వినియోగం తగ్గింది. దీంతో కొట్టేసిన వృక్షాలను టింబర్ డిపోలకు, కందిపప్పు మిల్లులకు తరలిస్తున్నారు. మాచర్ల, దుర్గి పరిసర ప్రాంతాల్లో అధికంగా ఉన్న కందిపప్పు మిల్లుల బాయిలర్లలో ఉపయోగించేందుకు కలపను అధికంగా తరలిస్తున్నారు. జువ్వి, రావి, మర్రి, తుమ్మ చెట్లను అధికంగా మిల్లులకు తరలిస్తున్నారు. అనుమతి లేకుండా చెట్లు నరికితే అటవీ సంరక్షణ చట్టం ప్రకారం రూ.10 వేల జరిమానా, మూడు నెలల నుంచి ఏడాది జైలు శిక్ష పడే అవకాశం ఉంది. చెట్లను తొలగించాల్సి వస్తే తహసీల్దారు అనుమతి తప్పనిసరి. అయినా చెట్లను నరకడం సర్వసాధారణంగా మారింది.



కందిపప్పు మిల్లు వద్ద దుంగలు



ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

జీడీసీసీబీ భోక్తలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార(జీడీసీసీ) బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. సత్యమేవ జయతే పేరుతో మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నేతలతో పాటు ఉద్యోగుల సంఘ నేతలు ప్రసంగించారు. రెవెన్యూ రికార్డు, ఆధార్, పాన్ కార్డులు సృష్టించి డీసీసీబీలో అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి సదరు మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ ద్వారా చేపట్టిన సెక్షన్ 51 విచారణ కొందరిని సంతృప్తి పరిచేలా, అసలైన నిందితులను కాపాడేందుకు జరిగినట్లుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. అక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న అధికారులకు కొందరు పెద్దల సహకారం ఉన్నట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. స్కాంతో సంబంధంలేని ఉద్యోగులపై చర్యలు నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

సత్యమేవ జయతే అంటూ సహకార ఉద్యోగుల దీక్ష

ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి శ్రీనివాసరావు, అఖిల భారత కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నేతలు కె.వి.ఎస్.రవికుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎం.హనుమంతరావు, అరుణ్‌కుమార్, అంజిబాబు, జాతీయ కార్యదర్శి గని, కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్(టీడీపీ), మస్తాన్‌వలి(కాంగ్రెస్), సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, రచయిత దేవరకొండ శ్రీనివాస్, కళాకారులు అభ్యుదయ గేయాలు ఆలపించారు.



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు

వ్యవసాయ శాఖలో బదిలీల జాతర

గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ
పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి
పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం
'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం

గుంటూరు సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిసారి జరిగిన బదిలీ ప్రక్రియలో వ్యవసాయ శాఖలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులకూ స్థానచలనం తప్పలేదు. లెక్కకు మించిన సంఖ్యలో ఏడీఏలు, ఏఓలు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో తిష్టవేసిన కింద స్థాయి అధికారులు పలువురు బదిలీ అయ్యారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేల లేఖలను సైతం పక్కన పెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు చెప్పిన చోట పలువురికి పోస్టింగ్ ఇచ్చారు.


నున్న వెంకటేశ్వర్లు

'నున్న'కు కీలక స్థానం

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లును నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా నియమించారు. ఆయన నియామకం కోసం మంత్రులు, ఐఏఎస్‌లు సిఫార్సు చేసినట్లు తెలిసింది. కమిషనరేట్‌లో ఉన్న ఎం.జగ్గారావును పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారిగా నియమించారు. కడప జిల్లా వ్యవసాయ అధికారి ఎ. నాగేశ్వరావును గుంటూరు డీఏఓగా నియమించారు. ప్రస్తుతం గుంటూరు డీఏఓ నరసింహారావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ తర్వాత నాగేశ్వరావు డీఏఓగా బాధ్యతలు చేపడతారు.

మండల వ్యవసాయ అధికారులు..

బాపట్ల ఏఓ యాకోబును నరసరావుపేటకు, మంగళగిరి ఏఓ శ్రీనివాసులును గుంటూరుకు, చీరాల ఏఓ సుమతిని బాపట్లకు, కొరిశపాడు ఏఓ శ్రీనివాసరావును బల్లికురవకు, ఏఓ ఎం.సరితను వేటపాలేనికి, ఏఓ లావణ్యను మార్టూరుకు, ఏఓ కుమారిని యద్దన పూడికి, ఏఓ లక్ష్మిని మేడికొండూరుకు, ఏఓ శ్రీదేవిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, ఏఓ సరితను చిలక లూరిపేటకు, ఏఓ సుభాషిణిని గుంటూరుకు, ఏఓ విజయబాబును దుగ్గిరాలకు, ఏఓ ఇల్సా సువిధను బాపట్ల జిల్లా కార్యాలయానికి, ఏఓ శ్రీరంజనిని కాకుమానుకు, ఏఓ లక్ష్మారెడ్డిని రెంటచింతలకు, ఏఓ పుల్లారెడ్డిని కొల్లూరుకు, ఏఓ బ్రహ్మారెడ్డిని భట్టిప్రో లుకు, ఏఓ శాంతిని నరసరావుపేటకు, ఏఓ సత్యవాణిని తాడేపల్లికి, ఏఓ కృష్ణ వేణిని బాపట్లకు, ఏఓ లోకేశ్వరిని బాపట్లకు, ఏఓ కల్పనను గుంటూరు కు, ఏఓ సుధారాణిని గుంటూరుకు, ఏఓ కిరణ్మయిని చీరాలకు, ఏఓ శిరీషను మంగళగిరికి, ఏఓ కృష్ణయ్య ను పెదకూరపాడుకు, ఏఓ హరిప్రసాద్‌ను యడ్లపాడుకు, ఏఓ సంధ్యారాణిని పిడుగురాళ్లకు, ఏఓ అరుణను పల్నాడుకు, ఏఓ శ్రీధర్ రెడ్డిని ముప్పాళ్లకు, ఏఓ మల్లికార్జునరావును గుంటూరుకు, ఏఓ సరళను బాపట్లకు, ఏఓ సుబ్రహ్మణ్యంను పెదనందిపాడుకు, ఏఓ హేమంత్ భరత్ కుమార్‌ను అమృతలూరుకు, ఏఓ బి. కిషోర్‌ను గుంటూరు రూరల్‌కు, ఏఓ శివ లలితను రొంపిచర్లకు, ఏఓ శోభరాణిని గుంటూరుకు, ఏఓ మోహన్‌రెడ్డిని బాపట్లకు, ఏఓ వెంకట్రావును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, ఏఓ అలేఖ్య జాన్‌ను గుంటూరు కమిషనరేట్‌కు, ఏఓ సుజాతను గుంటూ రు జేడీ కార్యాలయానికి, ఏఓ ప్రియదర్శినిని చేబ్రోలు కు, ఏఓ మీరమ్మను ఇంకొల్లుకు, ఏఓ వెంకటేశ్వరా వును పొన్నూరుకు, ఏఓ బాలాజీ గంగాధర్‌ను వెల్దుర్తికి, ఏఓ రాంమోహన్ రెడ్డిని కొరిశపాడుకు, ఏఓ పద్మాంజలిని బాపట్లకు, ఏఓ రామమ్మను మాచవరానికి, ఏఓ నాగరాజును కారంచేడుకు, ఏఓ అరుణ కుమారిని బెల్లంకొండకు, ఏఓ ప్రేమ్‌సాగర్‌ను వేమూరుకు, ఏఓ శ్రీనివాసరెడ్డిని కొల్లిపరకు, ఏఓ భాస్కర రావును పర్చూరుకు, ఏఓ సునీతను వట్టిచెరుకూరుకు, ఏఓ వెంకటేష్‌ను దాచేప ల్లికి, ఏఓ నరసింహారావును కారంపూడికి, ఏఓ వెంకటరామయ్యను బాపట్లకు, ఏఓ పాపకుమారిని మాచర్లకు, ఏఓ స్రవంతిని గుంటూరుకు, ఏఓ సంధ్యారాణిని తుళ్లూరుకు, ఏఓ నరేంద్రబాబును గురజాలకు, ఏఓ శ్రీనివాస్ నాయక్‌ను తాటికొండకు, ఏఓ వరలక్ష్మిని వినుకొండకు, ఏఓ విజయరాజును నిజాంపట్నంకు, ఏఓ చంద్రశేఖర్‌ను చినగంజాంకు, ఏఓ సుధీర్ బాబును తెనాలికి, ఏఓ శారదను బాపట్లకి, ఏఓ సుగుణ బేగంను ప్రత్తిపాడుకు, ఏఓ సుదీర్‌ను బాపట్లకు, ఏఓ ఫరూక్‌ను చెరుకుపల్లికి, ఏఓ ఆంజనేయులు నాయక్‌ను నూజెండ్లకు, ఏఓ సైతాను సంతమాగులూరుకు, ఏఓ మహేష్‌బాబును రేపల్లెకు, ఏఓ ఖడ్గం రమణకుమార్ ను పెదకాకానికి, ఏఓ సుబ్బారెడ్డిని సత్తెనపల్లికి, ఏఓ కోట య్యను నరసరావుపేటకు, ఏఓ మాధవిని గుంటూ రు కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఏడీఏల బదిలీలు ఇలా..

వైసీపీ అనుకూల ఏడీఏలు గుంటూరు సమీప ప్రాంతాల్లో పాగా వేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారంలో తీవ్ర పోటీ ఏర్పడింది. పర్చూరులో పనిచేస్తున్న ఎన్.మోహన్‌రావును గుంటూరు ఏడీఏగా నియమించారు. బాపట్ల జిల్లా అద్దంకి ఏ డీఏ ధనరాజును బాపట్లకు, గుంటూరు ఏడీఏ అన్నపూర్ణమ్మను బాపట్ల డీఏఓ కార్యాలయానికి బదిలీ చేశారు. మంగళగిరి ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డిని బాపట్లకు, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావును బాపట్లకు, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మను సత్తెనపల్లికి, సత్తెనపల్లి ఏడీఏ అమలకుమారిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, వినుకొండ ఏడీఏ రవి బాబును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, బాపట్ల ఏడీఏ లక్ష్మిని రేపల్లెకు, బాపట్లకు చెందిన మరో ఏడీఏ రత్నకుమారిని చీరాలకు, పల్నాడు జిల్లా కేంద్రంలో ఉన్న ఏడీఏ రవి కుమార్‌ను వినుకొండకు, ఏడీఏ శివకుమారిని గుంటూరుకు, బాపట్లలో పనిచేస్తున్న కెవీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా నరసరావుపేట ఏడీఏగా నియమించారు. గుంటూరు ఏడీఏ తోట కూర శ్రీనివాసరావు ను మంగళగిరికి బదిలీ చేశారు.

జగన్ ప్రభుత్వంలో మీడియాపై ఆంక్షలు, దాడులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో మీడియాపై ఆంక్షలు, జర్నలిస్టులపై దాడులకు లెక్కేలేకుండా జరిగాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పత్రికలు, మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు నాడు వైఎస్ఆర్ జీఓ నంబరు 930 తీసుకువస్తే తండ్రి వారసత్వంగా జగన్ రెడ్డి 2430 జీవోను విడుదల చేశారని గుర్తు చేశారు. ఏబీఎన్, టీవీ 5, ఈ టీవీ లాంటి అత్యంత ప్రజాదరణ కలిగిన ఎలక్ట్రానిక్ మీడియాపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పదుల సంఖ్యలో అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చానళ్ల ప్రసారాలను ఆపాలని కేబుల్ ఆపరేటర్‌లకు వైసీపీ పాలకులు అనధికారికంగా హుకుం జారీ చేశారని దుయ్యబట్టారు. టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్రను అర్ధరాత్రి అరెస్టు చేసి, వేధించారని గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్టు అంకబాబు, కోగంటి శ్రీనుబాబు, పరుచూరి రమ్య, దాసరి కోటి లాంటి వారిని అరెస్టు చేసి కస్టోడియల్ టార్చర్ చేశారని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి కాటా సత్యనారాయణ హత్యకు గురైన విషయం ప్రజానీకం మరువలేదన్నారు. అమరావతిలో పోలీసులను ఫొటోలు తీశారని ముగ్గురు విలేకర్ల పై అక్రమ కేసులు బనాయించిన విషయం వైసీపీ పాలకులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఏబీఎన్, టీవీ 5, జర్నలిస్టు ల పై దాడికి పాల్పడి కార్లు, కెమెరాలు ధ్వంసం చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ పాసులు ఇవ్వకుండా నాటి వైసీపీ పాలకులు జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై జరిగిన దాడులు, హత్యలపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు.

అమరావతిపై విష ప్రచారం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్ యాజమాన్యం ఆలోచనల మేరకు అమరావతిపై కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు కావాలని మాట్లాడారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చోళులు, రెడ్డిరాజులు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, సిద్ధార్థుడు నడయాడిన ప్రాంతాన్ని వేశ్యల రాజధాని అని మాట్లాడం ఆడపడుచులందరిని అవమానించి నట్లేనని భావిస్తున్నామన్నారు. దీనికి కారకులైన చానల్ యాజమాన్యం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో మీనమేషాలు లెక్కపెడితే ప్రజల ఆగ్రహావేశాలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాటల్లో ఎక్కడ చూసినా రెచ్చగొట్టే ధోరణే కనపడుతుందన్నారు. సంకర జాతి అంటున్నారని, ఇది వినడానికే ఇబ్బందిగా ఉందన్నారు. రాజధానిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ ముందుకొచ్చాయని, ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకొని ఆడపడుచులకు న్యాయం చేసి ఆత్మగౌరవం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షి చానల్‌లో రాజధాని మహిళలనే కాదు యావత్ జాతినే కించపరిచారన్నారు. సమావేశంలో కొక్కిరాల శ్రీనినివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతనిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో పొగాకు కొనుగోలు చేయండి

● కంపెనీల యజమానులకు రైతు నాయకుల విజ్ఞప్తి


పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులుతో చర్చలు జరుపుతున్న రైతు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులకు రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని ఓ హోటల్లో కంపెనీల యజమానులతో రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపారు. పొగాకు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నారని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకువచ్చారు. వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఈ నెల 5న జీపీఐ కంపెనీ ఎదుట జరిగిన ఆందోళనలతో కొనుగోళ్లు ముందుకు సాగాయని అన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లు ప్రారంభించిందని, ఈ సమయంలో మిగిలిన కంపెనీలు ముందుకు వస్తే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. తమ టార్గెట్‌కు మించి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తామని కంపెనీల యజమానులు ఈ మేరకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. చర్చల్లో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఐటీసీ జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఎలైన్స్ కేర్ అధినేత చేబ్రోలు రవీంద్ర, పోలిశెట్టి ఇండస్ట్రీస్ అధినేత పోలిశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

'హృదయ' విదారకం..

● ఆగిన తండ్రి గుండె.. ● గంటల వ్యవధిలో కుమార్తె ఆత్మహత్య


చీమకుర్తి సుబ్రహ్మణ్యం


లక్ష్మీశ్రావణి

తెనాలి, మారీసుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో 'హృదయ' విదారక ఘటన చోటు చేసుకుంది. తండ్రి గుండె ఆగిందని తెలుసుకుని కుంగిపోయిన కుమార్తె గంటల వ్యవధిలో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఒకే రోజులో వెనువెంటనే తండ్రి, కుమార్తె మరణించడంతో.. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోతే.. ఈ విషాదం స్థానికులను సైతం కంటతడి పెట్టింది. తెనాలి టూటౌన్ పోలీసులు వివరాల మేరకు.. గంగానమ్మ పేటకు చెందిన పసువుల దాణా వ్యాపారి చీమకుర్తి సుబ్రహ్మణ్యం, హేమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఏడాది క్రితం పెద్ద కుమార్తె లక్ష్మీశ్రావణికి(23) విజయవాడకు చెందిన చినరాజాతో వివాహం చేశారు. కొంత కాలానికే దంపతుల మధ్య మనస్పర్ధలు రావడంతో పుట్టింట్లోనే లక్ష్మీశ్రావణి ఉంటోంది. తండ్రి సుబ్రహ్మణ్యానికి మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి మృతి చెందాడన్న వార్తతో కుమార్తె లక్ష్మీ శ్రావణి ఒక్కసారిగా కుంగిపోయింది. తనను ఎంతో అల్లారుముద్దుగా పెంచిన తన తండ్రి విగత జీవిగా కన్పించడంతో మనోవేదనకు గురైంది. రోదిస్తూనే ఇంటికి దగ్గరలో ఉన్న అపార్ట్‌మెంటు పైకి వెళ్లింది. తండ్రి లేకుండా తను జీవించలేనన్నట్లుగా పైనుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అపార్ట్‌మెంటు వాచ్‌మెన్ ఇది గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. తీవ్ర గాయాలతో ఉన్న లక్ష్మీశ్రావణిని పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి కుమార్తె వెనువెంటనే మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చినకొండ్రుపాడు వద్ద గల పోలిశెట్టి టొబాకో కంపెనీలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ బుజ్జి హుస్సేన్ (63) స్థానిక పోలిశెట్టి టుబాకో కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం కంపెనీలో ఉన్న దేవుడి విగ్రహాలను పూజ నిమిత్తం కడిగేందుకు ప్రాంగణంలోనే ఉన్న చెరువు వద్దకు హుస్సేన్ వెళ్లాడు. బకెట్‌తో నీరు తోడుతూ.. జారి పడిపోయాడు. తోటి ఉద్యోగులు కాపాడే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. భార్య అబ్బులున్‌బీ ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు

మాచర్లటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి తనతో తీసుకెళ్లిన వ్యక్తిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీకి చెందిన బాలిక తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. బాలిక తల్లి చనిపోగా తండ్రి వేరే మహిళను వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో బాలిక తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. తన అమ్మమ్మ ఆరోగ్య సమస్యల నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఆమెతో కలిసి వచ్చేది. అదే ప్రాంతంలోని చికెన్ షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆ బాలికకు మాయమాటలు చెప్పి పరిచయం పెంచుకున్నాడు. ఈనెల 3న ఇద్దరూ పట్టణం నుంచి వెళ్లిపోయారు. బాలిక కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు ఇద్దరూ తెనాలిలో ఉన్నట్లు గుర్తించి.. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

విద్యాహక్కు చట్టం ప్రవేశాల నిరాకరణపై ఆందోళన


ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

గుంటూరు (విద్య) జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక పాఠశాలలు విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికైన విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని సిటిజన్ రైట్స్ అధ్యక్షుడు ఎస్కే జిలాని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికై.. పాఠశాలలో అడ్మిషన్ నిరాకరించిన పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అడ్మిషన్ల కోసం పాఠశాలకు వెళ్తే యాజమాన్యాలు తల్లిదండ్రులను అవమానాలకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించేందుకు విద్యా హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశామని, అయితే యాజమాన్యాలు ప్రవేశాలను నిరాకరిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ సిటిజన్స్ రైట్స్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్‌టీఈ ప్రవేశాలను నిరాకరించే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 511.90 అడుగులు ఉంది. ఇది 134.91 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ల రద్దు


గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఆదరణ లేని కారణంగా రెండు స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07041) సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలుని ఈ నెల 12న, (07042) కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 13న నుంచి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టికెట్‌లు బుక్ చేసుకొన్న వారికి పూర్తి రీఫండ్ చేస్తామన్నారు.

డివైడర్ ఢీకొన్న ద్విచక్రవాహనం మహిళ మృతి

బాపట్లరూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా.. ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బేతపూడి గ్రామానికి చెందిన రాజు శ్రీనివాసరెడ్డి, గవినివారిపాలేనికి చెందిన శివకుమారి ద్విచక్ర వాహనంపై బాపట్ల పట్టణం నుండి సూర్యలంక వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కనకాద్రి నగర్ సమీపంలోని డివైడర్‌కు వేగంగా వారి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమారి (43) అక్కడికక్కడే మృతి చెందగా.. రాజుశ్రీనివాసరెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు స్థానికులు తరలించారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల


వర్సిటీలోనీ లైబ్రరీలో పరిశీలన చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

పెదకాకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాల సంఖ్య, వార్షిక బడ్జెట్, విద్యార్థులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పోటీ పరీక్షల విభాగంలోని విద్యార్థులతో చర్చించారు. మెరుగైన సేవలకు సూచనలు ఇచ్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గ్రంథాలయాల అభివృద్ధికి అంకితభావంతో నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీ గ్రంథాలయ అధికారి కె.వెంకట్రావు, ఎస్వీఆర్ విద్యా సంస్థల అధిపతి వై. వెంకట్రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఉన్నారు.

మూడు లోకోలు ఫెయిల్యూర్

● గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు ● ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రయాణికులు

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒకే రోజున మూడు రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల లోకోమోటివ్(ఇంజిన్)లు ఫెయిల్యూర్ అయ్యాయి. (17255) నరసపూర్ - లింగంపల్లి, (12806) లింగంపల్లి - విశాఖపట్టణం, (17256) లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణం ప్రారంభించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వచ్చాక మొరాయించాయి. గమ్యస్థానాలకు రెండు నుంచి మూడు గంటల ఆలస్యంగా చేరాయి. స్టేషన్లలో కాకుండా మధ్యలో లోకోలు ఫెయిల్ కావడంతో వాటి వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి రావడంతో అవి కూడా ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. ఉష్ణోగ్రతలు హెచ్చుగా ఉండటంతో జనరల్, స్లీపర్ క్లాస్ బోగీల ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ తిప్పర్తి రైల్వేస్టేషన్‌లో లోకో ఫెయిల్ కావడంతో రెండు గంటలకు పైగా నిలిపేశారు. ఈ రైలుకు స్టేషన్‌లో సమస్య రావడం వల్ల వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లకు ఇబ్బంది లేకపోవడంతో వాటిని పంపించేశారు. లింగంపల్లి - నరసపూర్ రైలుకు వలిగొండలో లోకో ఫెయిల్ కావడంతో గంటన్నరకు పైగా అక్కడ నిలుపుదల చేశారు. ఆ తర్వాత గుంటూరుకు వచ్చాక మరో లోకో అమర్చడానికి 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేకపోవడంతో రాయగడ నుంచి గుంటూరు రావాల్సిన ఎక్స్‌ప్రెస్‌ని అవుటర్‌లో 45 నిమిషాల వరకు నిలిపేశారు. లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం నల్గొండ రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించే సమయంలో లోకోలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ రైలు కొంతభాగం స్టేషన్‌లోని లూప్‌లైన్‌లో, మరికొంత భాగం మెయిన్‌లైన్‌లో ఉండటంతో వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి వచ్చింది. హౌరా నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్‌ని నల్గొండలో 40 నిమిషాలకు పైగా నిలిపేశారు. (07421) చర్లపల్లి - శ్రీకాకుళం స్పెషల్‌ని శ్రీరాంపురంలో, తిరువనంతపురం - చర్లపల్లి శబరి ఎక్స్‌ప్రెస్‌ని రాయనగూడలో గంటకు పైగా నిలిపేయాల్సి వచ్చింది. గంటల తరబడి రైళ్లను ఎందుకు నిలుపుదల చేశారన్న సమాచారాన్ని ప్రయాణికులకు చెప్పలేదు. దీంతో మండ టెండలో అవస్థలు పడ్డారు. మరోవైపు ఎన్‌టీఈఎస్‌లో ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం ప్రయాణిస్తోందని తప్పుడు సమాచారం అప్‌డేట్ చేశారు.

38,031 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 41,497 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,031 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,627 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	12500	334	9500	14000
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	14500
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14600
షార్క్-1	10000	12000	బ్యాడిగి	10000	13500
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

ఏపీ జెన్కో సెక్యూరిటి సిబ్బంది బదిలీ

రెంటచింతల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మిత మైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఆ విభాగం చీఫ్ పీ పనసారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎం సంతోష్‌కుమార్‌ను విజయవాడలోని విద్యుత్ సౌధాకు, కె.సతీష్‌కు మార్‌యాదవ్, టి.వెంకట నాగేశ్వరరావులను ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ పవర్‌స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు.

పలుశాఖల అధికారుల బదిలీలు

పిడుగురాళ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాదారణ బదిలీల్లో భాగంగా వ్యవసాయశాఖ, మున్సిపల్‌శాఖ అధికారులు బదిలీ అయ్యారు. పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీ శ్రీధర్‌ను విజయవాడలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు అందాయి. అదేవిధంగా గిద్దలూరు నుంచి ఐ శ్రీనివాసులు పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. పిడుగురాళ్ల వ్యవసాయ అధికారిగా సంధ్యారాణి, మాచవరం వ్యవసాయ అధికారిగా రామమ్మ, దాచేపల్లి వ్యవసాయ అధికారిగా కే వెంకటేష్, గురజాల వ్యవసాయ అధికారిగా నరేంద్రబాబులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పిడుగురాళ్ల ఏడీఏగా బీ శ్రీకృష్ణదేవరాయలును ఇక్కడే ఏడీఏగా నియమించారు.

అచ్చంపేట తహసీల్దార్‌గా సరోజ

అచ్చంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండల తహసీల్దార్‌గా ఎన్ సరోజ బాధ్యతలు చేపట్టారు. ఆమె సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తూ అచ్చంపేటకు బదిలీ అయ్యారు. అచ్చంపేటలో పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్ దాచేపల్లికి బదిలీ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీపాలదిన్నెపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గంగవరపు లాజర్‌బాబు కుమార్తె మదర్‌థెరిస్సా వివాహానికి మంగళవారం గ్రామ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. పేద కుటుంబం కావటం, లాజర్‌బాబు గత ఏడాది మృతి చెందడంతో పరిస్థితిని గమనించి పెళ్లి ఖర్చుల నిమిత్తం పెళ్లికుమార్తె తల్లి మరియరాణికి రూ.40వేలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు మార్కెట్‌యార్డు డైరెక్టర్ పాటిబండ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావుల సహకారంతో ఈ ఆర్థికసాయం అందజేసినట్టు పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యకర్తల కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిలారి కృష్ణగిరి సుమన్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, నారుకొండ వీర వరప్రసాదు, గంగవరపు దాసు, శివశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ నేత మృతి

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లూరి ప్రభుదాసు(75) మంగళవారం మృతి చెందారు. ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో పని చేస్తూ వస్తున్నారు. ప్రభుదాసు మరణవార్త తెలుసుకున్న టీడీపీ నేతలు బండారు నాగరాజు, సయ్యద్ పెద కరీముల్లా, రాంబో బుడే, నూర్ బాషా జాన్ బాబు, పూజల వెంకట కోటయ్య, మస్తాన్‌వలి, పెద్దింటి వెంకటేశ్వర్లు, కంభంపాటి అబ్రహం, నాగులు తదితరులు ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

పిడుగురాళ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం కొనసాగించిన విధానాలను అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి డిమాండ్‌లను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను తెలిపారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏళ్లతరబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, పండుగ సెలవులు, క్యాజువల్ సెలవులు అమలు చేయాలని కోరుతూ కమిషనర్ పీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజు, విజయ్, రమేష్, గద్దె శ్రీను, వెంకయ్య, వేముల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం మొక్కలు నాటాలి

ముప్పాళ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మతృభూమి పరిరక్షణకై ఒక మొక్కను నాటుదాం. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి పర్యకరణాన్ని కాపాడాలి అన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ బల్లిబాబు, మహిళ పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 21.20 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నేడు పిల్లుట్లలో వైద్యశిబిరం

మాచవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్లలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని పిడుగురాళ్ళ ఉన్నం ఛారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. పిల్లుట్లతో పాటు పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచు కోవాలని కోరారు.

కూటమి మహిళల నిరసన ర్యాలీలు

- జగన్ మీడియా ప్రతుల దహనం
- అంబేద్కర్ విగ్రహం వద్ద, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉంచి నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు


సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న తెలుగుమహిళలు

పెదకూరపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యానించటం దారుణమని టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. పెదకూరపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచనలతో రాజధాని మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్ మీడియాపై నిషేధం విధించాలని, మహిళలకు క్షమాపణ చెప్పాలని బ్యానర్లతో, ప్లే కార్డులతో నల్ల బెలూన్‌లు, నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా నేతలు పఠాన్ నూర్జహాన్, వేగుంట రాణి, షేక్ ముంతాజ్, గంగినేని లీలావతిలు మాట్లాడుతూ అమరావతి ప్రాంతంపై మితి మీరిన విద్వేషంతో వైసీపీ నాయకులు సైకోలుగా మారి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. భారతీరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సజ్జలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మంచి నీటి చెరువు వద్ద నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉంచారు. ఈ ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, జిల్లా, నియోజకవర్గ, మండలాల నాయకులు భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, ఏటుకూరి రత్నకుమార్, గుడిపూడి రాజు, పరుచూరి పూర్ణచంద్రరావు, ఏటుకూరి బ్రహ్మయ్య తదితర నాయకులు, మహిళా నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో మహిళల నిరసన ర్యాలీ

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలను అవమాన పరుస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తూ జగన్ మీడియాను తక్షణమే మూసివేయాలంటూ తెలుగుదేశం, బీజేపీ, జనసేన మహిళలు మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలను అవమాన పరిచిన జగన్ మీడియాపై చట్టపరంగా చర్యలు తీసుకొని ఛానల్‌ను, పత్రికను మూసి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చక్రవర్తికి అందించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ఆందోళన చేశారు. కార్యక్రమంలో తెలుగుమహిళా నేతలు భీమినేని వందనాదేవి, మన్నవ శారదాదేవి, కోమటినేని శోభారాణి, గొర్రెపాటి సుశీల, ఎలినేడి లక్ష్మీతులసీ, తోట అంబిక, తెలుగుదేశం జనసేన, బీజేపీ మహిళా నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● రాజుపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు, ఆ పార్టీకి చెందిన పత్రిక, టీవీలకు చెందిన యాంకర్లకు మహిళలంటే చాలా చులకన భావం ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు విమర్శించారు. అమరావతి, అక్కడ మహిళలపై వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.

జగన్ మీడియా ప్రతులు దహనం

గురజాలటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని మహిళలు భారీగా మంగళవారం గురజాల పట్టణానికి చేరుకొని ర్యాలీ జరిపారు. జగన్ మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జగన్ మీడియా ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలు భారీగా పాల్గొన్నారు.


గురజాలలో జగన్ మీడియా ప్రతులను దహనం చేస్తున్న మహిళలు

రెంటచింతల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన జగన్ మీడియాను నిషేధించాలని కోరుతూ టీడీపీ మండల నేతలు మంగళవారం సాయంత్రం గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారిపై జగన్ మీడియా ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, శౌర్రెడ్డి, ప్రభురాజు యాదవ్, కోటేశ్వరరావు, నారాయణపురం శ్రీనివాసరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ మీడియాను నిషేధించాలి

మాచర్లటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి జగన్ మీడియాను సాగనంపాలని కూటమి నేతలు నినాదాలు చేశారు. రాజధాని అమరావతి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన పాత్రికేయులను, మాట్లాడించిన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో వడ్డె ఓబన్న సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో మహిళలు అధికంగా పాల్గొని జగన్ మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో జగన్ మీడియా ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మయాదవ్, టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, పోలూరి నరసింహారావు, కొమెర అనంతరాములు, గుండాల శ్రీనివాస్ యాదవ్, జల్లెల కొండలు, మాచర్ల వాసు, షేక్ మో సిన్, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, కొమెర శివ, షేక్ జాని, మేకల దాసు, తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, అనురాధ, లక్ష్మీ, కండె పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ఘన విజయం సాధించి ఏడాది పాలనలో సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సాగిన లక్ష్యాన్ని చాటి చెప్పేలా నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పార్కు సెంటర్ వర కు సాగనున్న ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలి

యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సీడ్ - ఏపీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన బుధవారం మాచర్ల పట్టణంలో నిర్వహించనున్న వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే వర్క్‌షాపులో వ్యవసాయం, ఉద్యాన, పరిశ్రమలు, పశుసంవర్ధక శాఖ రంగాల్లో పరిశ్రమలను స్థాపించేందుకు గల సాధ్యాసాధ్యాలు, పెట్టుబడులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వంటి అనేక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించడంతోపాటు తగిన సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు.

పల్నాడు జిల్లా బాలుర, బాలికల ఫుట్ బాల్ జట్టు ఎంపిక


పల్నాడు జిల్లా బాలుర, బాలికల ఫుట్ బాల్ జట్టు

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పల్నాడు జిల్లా స్థాయి సీనియర్ బాల బాలికల ఫుట్ బాల్ జట్ల ఎంపిక జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో అర్హులను జట్టులో ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐఎస్ నాగిరెడ్డి, శ్రీరామిరెడ్డి, అప్పిరెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, శ్రీనివాసరావు, రియాజ్ తదితర పీడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత పీఈటీ ఐఎస్ నాగిరెడ్డిని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యేశ్వరరావు ఘనంగా సన్మానించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సోలార్‌పవర్‌తో విద్యుత్ ఆదా


పీఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ పి.విజయకుమార్

పిడుగురాళ్ళ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌తో విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ పీ విజయకుమార్ తెలిపారు. పీఎం సూర్యఘర్‌పై మంగళ వారం పిడుగురాళ్లలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు, వెండర్స్‌కు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. సోలార్ ప్యానల్ ఏర్పాటుకు సంబంధించిన ఖర్చులు, వివరాలు తెలు పడంతో పాటు ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని గృహ అవసరాలకు, వ్యాపారాలకు ఉపయోగించుకోవచ్చు అన్నారు. గృహ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణ గడువు ఈ నెలాఖరు వరకు ఉందని విజయకుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో పిడుగురాళ్ల, మాచర్ల విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సైదయ్యకు ఘన నివాళి


సైదయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న హనుమంతురావు

దుర్గి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ మాజీ సభ్యుడు కోట సైదయ్య ఏడో వర్ధంతిని ఆయన స్వగ్రామమైన మండలంలోని ఓబులేశునిపల్లెలో ఘనంగా నిర్వహించారు. సైదయ్య కుమారుడు హనుమంతురావు, కూటమి నేతలు సైదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సైదయ్య సేవలు మరువలేనివన్నారు. గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓర్సు కోటేశ్వరరావు, ఆదినారాయణ, పసుమర్తి బుజ్జి, ఉన్నం మహేష్, మాగులూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక

బెల్లంకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ యోగాంధ్రా పోటీల్లో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంపీడీవో శ్రీనునాయక్ పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలో యోగా పోటీలు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా హాల్లో నిర్వహించారు. మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు పేర్కొన్నారు. సూర్య నమస్కారాలు, చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు, యోగా పోటీల్లో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు విద్యార్థులను అభినందించారు. అభినందించిన వారిలో తహసీల్దార్ అస్రిఫున్నీసా బేగం, యోగా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ వెంకట గిరిరెడ్డి తదితరులు అభినందించారు.

క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతి ప్రదానం


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

క్రోసూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు జడ్పీ హైస్కూల్లో 20 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని వైఎంసీఏ క్రోసూరు జట్టు గెలుపొందింది. వీరికి రూ.50, 116ల బహుమతిని మోపర్తి శ్యామ్ అందజేశారు. ద్వితీయ బహుమతిని క్రోసూరుకు చెందిన సాయి సీసీ జట్టు గెలుపొందింది. వీరికి రూ.25,116ల బహుమతిని అమృతలూరి వంశీ అందజేశారు. 3వ బహుమతిని పిడుగురాళ్ళ క్రికెట్ జట్టు గెలుచుకుంది. వీరికి రూ.10,116ల బహుమతిని టీడీపీ నాయకులు బండారు రాము అందజేశారు. వీరితో పాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్ అవార్డును పిడుగురాళ్ళకు చెందిన ప్రకాష్‌కు రూ.2,116లు టీడీపీ నాయకులు దారెడ్ల సీతారెడ్డి అందజేశారు. ఉత్తమ బౌలర్ అవార్డును క్రోసూరుకు చెందిన కోటికి రూ.2,116 ముస్తఫా అందజేశారు. విజేతలకు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో అనేక మంది క్రీడాభిమానులు పాల్గొన్నారు. మొత్తం 40 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి.

హర్షిత్‌కు ఎమ్మెల్యే కన్నా సన్మానం


పట్టణంలోని ప్రజావేదికలో హర్షిత్‌ను సన్మానించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన తిరువెళ్ల సాంబ శివరావు, శివపార్వతుల కుమారుడు హర్షిత్ ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్‌లో 352వ ర్యాంకు సాధించిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ ప్రజావేదికలో హర్షిత్‌కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఆయన కుటుంబసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, నూర్‌బాషా ఆన్‌బాబు, మస్తాన్‌వలి, ఆర్యవైశ్యనేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నా ప్రత్యేక పూజలు

ముప్పాళ్ల, జూన్10(ఆంధ్రజ్యోతి):మండలంలోని దమ్మాలపాడు ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరునాళ్ల వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా తిరునాళ్లలో పాల్గొని స్వామి వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది.

పోలీసుల అదుపులో రెండు గ్రానైట్ లారీలు

కారంపూడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సరైన బిల్లులు లేకుండా తరలిపోతున్న రెండు గ్రానైట్ లారీలను కారంపూడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత స్థానిక చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఎస్ఐ వాసు తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రకాశం జిల్లా నుంచి గ్రానైట్ రాయి లోడుతో వస్తున్న రెండు లారీలను గుర్తించారు. సరైన బిల్లులు చూపకపోవడంతో ఆ లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను ఎగవేతకు రాత్రి వేళల్లో ఈ లారీలను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత వైసీపీ హయాంలో గ్రానైట్ రాయి బిల్లులు లేకుండా ఐదేళ్లపాటు రోజుకు సుమారు 100కు పైగా లారీలు ఇటు వైపుగా నాగార్జున సాగర్ నుంచి తెలంగాణకు చేరేవి. ఎటువంటి తనిఖీలు లేకుండా పోలీసులను వినియోగించుకునే వారనే ఆరోపణలు ఉన్నాయి. మరలా గ్రానైట్ లారీల అక్రమ రవాణా మొదలైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


టీడీపీ ప్రజావేదికలో బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రజావేదికలో మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, సయ్యద్ పెద కరీముల్లా, మస్తాన్‌వలి, కోమటినేని శోభారాణి, ఎలినేడి లక్ష్మీతులసీ, అంకాళ్ళ ప్రభుదాసు, జానీ ఖాజావలి, పూజల వెంకట కోటయ్య, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● రాజుపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు శివారు వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనాథ పిల్లల, వృద్ధాశ్రమంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని కేఎన్‌ఆర్ విద్యాసంస్థలు, పీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు అన్నదానం చేశారు.

● బెల్లంకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, అక్కల వెంకట రామిరెడ్డి, గుడిసె కొండయ్య, వెన్నా సీతారామిరెడ్డి, ఓర్సు ఆనంద్, సర్పంచ్ జ్యోతి సముద్రం, తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని టీడీపీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు రాయిడి సాంబశివుడు, తిరువాయిపాటి ఆంజనేయులు, పొన్నెకంటి రవి, యడ్లపల్లి బుచ్చిబాబు, మూడావత్ బాలూ నాయక్, వై నాగయ్య, కోటా చంటి, తదితరులు కేక్ కట్ చేశారు.

● కారంపూడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్లో కూటమి నేతలు కేక్‌ను కట్ చేశారు. అనంతరం 200 మంది విద్యార్థులకు బుక్స్ పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్, చప్పిడి రాము, మనుగోడు సత్యం, మహిళా అధ్యక్షురాలు కాటంరెడ్డి నాగలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో నందమూరి బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల చెన్నయ్య ఆధ్వర్యాన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేపీ చారి, షేక్ అబ్దుల్లా, ఫరీద్, పలసా వెంకన్నబాబు, షేక్ నాగూర్ వలి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఆకస్మిక తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసూన

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంను పల్నాడు జిల్లా ప్రభుత్వ సామాజిక వైద్యాధికారి ఎం ప్రసూన మంగళవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వైద్యశాల ప్రాంగణంలో ముఖఃహాజరు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ వైద్యశాలలో త్వరలో బ్లడ్ స్టోరేజి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో గైనకాలజిస్టు రానున్నారని డెలివరీలు కూడా వైద్యశాలలో చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆరుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆదివారం సమయంలో ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. మార్చురీలో మరో ఫ్రీజర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. వైద్యశాల పరిసరాల్లో మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. పెదకూరపాడు వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించేలా స్థానిక వైద్యాధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఫార్మసీ అధికారి సీహెచ్ మాల్యాద్రి, వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

20న రామలింగేశ్వర ఆలయ దుకాణాల లీజుకు వేలం

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతిని రాజధానిగా చేసుకుని పాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు చేతుల మీదుగా ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 33 దుకాణాల లీజుకు సంబంధించి బహిరంగ వేలం ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. ఇప్పటివరకు నామమాత్ర లీజుతో దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుకాణాలు లీజు హక్కు పొందేందుకు పాటలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఈవో తెలిపారు. లీజు హక్కు పొందిన వారు మూడు నెలల అడ్వాన్సు ముందుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న దుకాణదారుల నుంచి కొందరు రూ.5వేలు వసూ ళ్ళ చేసి పాటను నిలుపుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

నడికూడి మార్కెట్ యార్డులో 6,400 మిరప టిక్కీలు అమ్మకం

దాచేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 7200 మిరప టిక్కీలు చేరుకోగా 6,400 మిరప టిక్కీలు అమ్మకాలు జరిగాయి. 334 రకం రూ.8వేల నుంచి రూ.12,500, తేజ రకం రూ.9వేలు నుంచి రూ.14వేలు, తాలు కాయలు రూ.2వేలు నుంచి రూ.7వేలు వరకు అమ్మకాలు జరిగాయి.

బలమిచ్చేలా బడి బువ్వ

● సర్కారు బడులకు చేరిన సన్న బియ్యం ● మధ్యాహ్న భోజనంలో మార్పులు

రాజుపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. గతేడాది అక్టోబరులో పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అభిప్రాయాలు సేకరించింది. స్థానికంగా ఉండే అభిరుచులకు అనుగుణంగా మెనూలో మార్పులు చేసింది. తాజాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

25 కేజీల సంచులు..అక్రమాలకు చెక్..

మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేకంగా 25 కేజీల సంచులు సిద్ధం చేశారు. గతంలో 50 కేజీ బస్తాలను సరఫరా చేసేవారు. అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పురుగులు పట్టేవి. సగానికి తగ్గించడం వల్ల గుర్తించడం సులువుగా ఉంటుంది. అదే విధంగా ఎలాంటి అక్రమాలు జరగకుండా క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగ్ అమర్చుతున్నారు.



సిద్ధంగా ఉన్న సన్న బియ్యం సంచులు

పోషకాలు పెంపొందించేలా..

ప్రస్తుతం ప్రతి పది మందిలో ముగ్గురు చిన్నారులు విటమిన్లు, సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడుతున్నారు. దీన్ని ఫోర్టిఫైడ్ ఆహారం ద్వారా సులభంగా పరిష్కరించవచ్చునని గుర్తించిన ప్రభుత్వం 25 కేజీల సంచిలో అర కేజీ ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి ఇస్తుంది. ఫోర్టిఫైడ్ బియ్యం కలిపిన సన్న బియ్యం కావడంతో నీటిలో ఎంత వరకు కడగాలనే దానిపైనా వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు.

450 సంచులు కేటాయింపు

రాజుపాలెం కేంద్రంగా ఉన్న పౌర సరఫరాల గోదాము నుండి రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహలకు సన్న బియ్యం సరఫరా చేశారు. రాజుపాలెం మండలానికి 268, బెల్లంకొండకు 182 సంచులు సరఫరా చేసినట్లు ఎంఈవో మల్లికార్జునశర్మ తెలిపారు.

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు


అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన భవనాల ఇంటిరీయల్ పనులను త్వరగా పూర్తిచేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి అమరావతిలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు పూర్తయిన ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహాలను పరిశీలించారు. గృహాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీల బంగ్లాలు, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు, ఈ6, ఈ12, ఎన్14 రహదారుల వద్ద జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కొరకు చేనేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వసతి సముదాయాలను, కార్మికుల పిల్లలకు కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సీఆర్‌డీఏ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌ఫ్రా) సీహెచ్ ధనుంజయ, చీఫ్ ఇంజనీర్ (హౌసింగ్ అండ్ బిల్డింగ్స్) ఎన్ శ్రీనివాసులు, చీఫ్ ఇంజనీర్ హౌసింగ్ అండ్ బిల్డింగ్స్ (నిర్వహణ విభాగం) డీ శ్రీరామచంద్రమూర్తి, చీఫ్ ఇంజనీర్ (కార్యాలయాలు) పీవీకే భాస్కర్, ఎస్ఈ బిట్ర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ధర్నాకు డబ్బులు ఇచ్చి తీసుకొచ్చిన జనం


వచ్చిన జనాభాను లెక్కిస్తున్న కార్యకర్తలు

తలకింత!

వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు జనాలు రాక నానా తంటాలు పడుతున్నారు. చేసేది లేక తలకింత అంటూ లెక్క కట్టి జనాన్ని తరలించి మహా ధర్నా అంటూ తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నా కూడా ఇదే తంతు. పట్టణ వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డబ్బులు ఇచ్చి మహిళలను తరలించారు. ఒక్కొక్కరిని లెక్కిస్తూ ఇలా ఫొటోలకు దొరికారు.

-గుంటూరు,ఆంధ్రజ్యోతి


గుంటూరులో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళలు


పెదకూరపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, బెలూన్‌లతో భారీ ర్యాలీ

మహిళల ఆగ్రహ జ్వాల

రాజధాని మహిళలపై సాక్షి న్యూస్ చానల్‌లో ప్రసారమైన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసనలు కొనసాగుతున్నాయి. మహిళల ఆగ్రహ జ్వాల రగులుతూనే ఉంది. సదరు చానల్‌ను బ్యాన్ చేసి, యాజమాన్యం తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదకూరపాడులో మహిళలు నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల బెలూన్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేటలోనూ ఇదే తరహాలో ప్లకార్డులతో తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు. తెనాలిలో జరిగిన మహిళల నిరసన ర్యాలీలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర పాల్గొన్నారు. గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో సదరు పత్రికా ప్రతులను మహిళలు తగలబెట్టారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయాలంటేనే భయపడే విధంగా కఠిన చట్టాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

-ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


తెనాలిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ శ్రేణులు



సాక్షి పత్రిక, ఛానల్‌ను మూసి వేయాలని సత్తెనపల్లిలో తెలుగు దేశం, బీజేపీ, జనసేన నిర్వహించిన ర్యాలీ



చిలకలూరిపేటలో తెలుగు మహిళల భారీ ర్యాలీ

ఆసక్తికరంగా జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు లయోలా పబ్లిక్ పాఠశాలలో జరిగిన ఏపీసీఐ ఎస్‌సీఈ పాఠశాలల జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఆసక్తికరంగా జరిగాయి. తొలుత ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపల్ డాక్టర్ నగయరాజ్ మార్క్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ నరేష్ ప్రారంభించారు. పోటీలలో అండర్-14 విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, లిటిల్ ఫ్లవర్ స్కూల్- గుంటూరు, హైదరాబాదు పబ్లిక్ స్కూల్- కడప, జట్లు పాల్గొనగా, అండర్-17


విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపాల్ నగయరాజ్

విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, స్టైమ్ పాఠశాల గుంటూరు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన పోరులో అండర్-14లో హైదరాబాదు పబ్లిక్ స్కూల్, అండర్-17 విభాగంలో లయోలా పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని ట్రోఫీ ప్రదానం చేశారు. పోటీలను పాఠశాల క్రీడ విభాగాధిపతి పట్టేటి బాపూజీ పర్యవేక్షించారు.

తాగునీరు @ 24/7

(5వ పేజీ తరువాయి)

సరఫరాకు అవసరమైన చర్యలను పబ్లిక్‌హెల్త్ అధికారులు చేపట్టారు. ఏడాది లోపు ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ పథకాన్ని ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పనులను పట్టాలెక్కించింది. రక్షిత మంచినీటి పథకాలను విస్తరిస్తున్నారు. నరసరావుపేటలో రూ.29.42 కోట్లతో, గుంటూరులో రూ.381.12 కోట్లు, తెనాలిలో రూ.61.61 కోట్లు, చిలకలూరిపేటలో రూ.160.90 కోట్లతో అమృత్2.0 కింద పనులు చేపట్టనున్నారు.

135 లీటర్లు దాటితే పన్ను

ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంతకు మించి నీటిని వినియోగిస్తే అదనపు నీటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తారు. నీటి పన్ను ఒక్కో పట్టణంలో ఒక్కోరకంగా ఉంది. ఉదాహరణకు నరసరావుపేటలో నెలకు ఇంటికి రూ.100 నీటి పన్ను చెల్లించాలి. ఇంట్లో ఎంతమంది ఉన్నారో గుర్తించి ఒక్కొక్కరికి 135 లీటర్ల చొప్పున వినియోగానికి నెలకు రూ.100 పన్ను చెల్లిస్తే సరిపోతోంది. ఇంతకు మించి వినియోగిస్తే అదనంగా పన్ను వసూలు చేస్తారు. నీటి వృథాను అరికట్టేందుకే ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు కొండవీడుకోటలో..

యోగాంధ్ర మహోత్సవం

● ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల హాజరు

యడ్లపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చారిత్రక కొండవీడు కోటలో బుధవారం యోగ్రాంధ్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర - 2025 పేరుతో చేపట్టిన మాసోత్సవాల్లో.. రాష్ట్రంలోని 100 ప్రముఖ పర్యాటక, చారిత్రాత్మక ప్రాంతాల్లో యోగా ప్రచారాన్ని కొనసాగిస్తోంది. కొండవీడుకోట ఘాట్ మార్గం చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు గంటన్నర పాటు యోగా ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.


కొండవీడుకోట ఘాట్ మార్గం


కొండవీడుకోట ఘాట్ మార్గంలో ఏర్పాటుచేసిన ప్రవేశద్వారం

ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

● వసతులపై జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ఆరా

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ ఎస్. సురేష్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్‌తో కలిసి బస్టాండ్‌లోని గుంటూరు-1, 2 డిపోల్లోని గ్యారేజ్‌లతో పాటు బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తూ పరిశుభ్రత, సౌకర్యాలపై ఆరా తీశారు. డిపో గ్యారేజ్‌లలో సిబ్బందితో మాట్లాడారు. పనిముట్లతో పాటు వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. బస్సులు ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచాలని సూచించారు. ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉన్న బస్సు ఎక్కిన చైర్మన్ ప్రయాణికులతో మాటామంతి కలిపారు. డ్రైవర్‌తో మాట్లాడి ఆక్యుపెన్సీ ఎలా ఉంది అంటూ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్టాండ్ లోని హోటల్స్, స్టాల్స్‌ను తనిఖీ చేసిన ఆయన ఎమ్మార్పీ మించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థకు కొత్త బస్సులతో పాటు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ సురేష్‌రెడ్డికి డీపీటీవో రవికాంత్, ఏటీఎం సత్యనారాయణ, గుంటూరు 1, 2 డిపో ఇన్‌చార్జి మేనేజర్లు , సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడుతున్న చైర్మన్ సురేష్‌రెడ్డి


ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తున్న చైర్మన్ సురేష్‌రెడ్డి పక్కన డీపీటీవో రవికాంత్ తదితరులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

డ్రంకెన్ డ్రైవ్‌కు రూ.10వేలు జరిమానా

నాదెండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తికి కోర్టులో జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు మంగళవారం గణపవరంలో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం తాగి కారు నడుపుతున్నట్లు గుర్తించి పున్నా సాయి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచారు. సాయికుమార్‌కు న్యాయమూర్తి ఐ.స్వాతి రూ.10వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.



బాలకృష్ణను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రత్తిపాటి

బాలకృష్ణకు ప్రత్తిపాటి జన్మదిన శుభాకాంక్షలు

చిలకలూరిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని బాలకృష్ణ గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. బాలకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో యడ్లపాడు మండల టీడీపీ నాయకులు పావులూరి శ్రీనివాసరావు, స్థానిక అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జె.కృష్ణ హరీష్ కూడా ఉన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ఈపూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. అంగలూరు, కొచ్చెర్ల తదితర గ్రామాలలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.

రేపు మున్సిపాలిటీ షాపుల అద్దె వేలం

చిలకలూరిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీకి సంబంధించి పలు చోట్ల వివిధ కేటగిరీలలో ఉన్న షాపుల అద్దె వేలంను గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. ప్రకాశం బిల్డింగ్-2 మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 18,19, 22, 25, ప్రత్తిపాటి పుల్లారావు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 15, గాంధీ పార్క్ దక్షిణం వైపు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1,3,16,18, 19, గాంధీ పార్క్ ఉత్తరం వైపు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2,7,9,10,11,12,13, వడ్డే నాగేశ్వరరావు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో 1,3,8, సోమేపల్లి సాంబయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 6(డి), బింగి రామూర్తి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7,8,9,10, 11,12 నంబరు షాపుల అద్దెకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందన్నారు. ఆసక్తి గలవారు నిబంధనలననుసరించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

రేపు పోలీస్ వాహనాల పాత పరికరాల వేలం

నరసరావుపేట లీగల్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వాహనాల పాత సామాన్లను ఈ నెల 12న వేలం వేయనున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 కు వేలం ప్రారంభమవుతుందని ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

పరగటిచర్ల అంగన్‌వాడీ 1వ సెంటర్‌కు ఆయా నియామకం

రొంపిచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరగటిచర్ల 1వ అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా నియామకం జరిగింది. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని అంబటి మహాలక్ష్మికి గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కామినేని వెంకట రంగారావు, కందుల వెంకటేశ్వర్లు, పగడాల రామ సుబ్బారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చీకటీగలపాలెంలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం

వినుకొండ, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) మండలంలోని చీకటీగలపాలెంలో ఎంపీడీవో పుట్టారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత సిబ్బంది పాల్గొని ప్రభుత్వ పథకాలు సంక్షేమ పథకాల గూర్చి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్ట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ ప్రభాకర్, ఏసోబు, రమేష్, అసిస్టు మేలుకొలుపు బృందం, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రవేశాలు

నూజెండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో 2025 - 26 విద్యా సంవత్సరానికి వసతి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వార్డెన్ ప్రభాకరరెడ్డి మంగళవారం తెలిపారు. మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు భోజనం, వసతి, దుస్తులు తదితర సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని వార్డెన్ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి హాస్టల్‌ను పునఃప్రారంభిస్తున్నట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

అనుచిత వాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి

● కూటమి మహిళా నేతల డిమాండ్

నరసరావుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జగన్ చానెల్‌లో జరిగిన డిబేట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలుచేసిన కృష్ణంరాజు, వెకిలి నవ్వు నవ్విన కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి చానెల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి మహిళా నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి గడియార స్తంభం వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధులు కనుమూరి లక్ష్మి, మానుకొండ జాహ్నవి, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు ఉదయశ్రీ తదితరులు మాట్లాడుతూ ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారన్నారు. ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా జగన్‌లో ఇప్పటికీ ఆహంకారం తగ్గలేదన్నారు. రాష్ట్రంలోని మహిళలను కించపరిచే విధంగా భారతిరెడ్డి తన చానెల్‌లో చేయించిన అసభ్యకర వాఖ్యలను సభ్యసమాజం ఖండిస్తోందన్నారు. ఇంతవరకు మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించి క్షమాపణ చెప్పకపోవడం దారుణం అన్నారు. మహిళలపై చేసిన వ్యాఖ్యలకు వారు తిరగబడితే జగన్ తాడేపల్లి నుంచి పారిపోయేవారన్నారు. అసభ్యకరంగా వ్యవహరిస్తున్న సాక్షి పత్రిక, చానెల్‌ను ప్రజలు బహిష్కరించాలన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలన్నారు. జగన్ సంస్థలు ఇప్పటికైనా బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే వారిని మహిళలు తగిన విధంగా సత్కరిస్తారన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కూటమి మహిళా నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న కూటమి మహిళా నేతలు, కార్యకర్తలు

వినుకొండలో...

వినుకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వి.వీఆర్ కృష్ణరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు ప్రసారం చేసిన సాక్షి టీవీ, యాజమాని వైస్ భారతిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమరావతి మహహిళా సంఘాల పిలుపు మేరకు వినుకొండలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆర్టీసీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ షేక్ షకీలా బేగంతో పాటు పలువురు మహిళలు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను పారదోలి వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసినా బుద్ధి రాలేదని తెలిపారు. రాష్ట్రంలోని మహిళలను కించపరిచేలా భారతీరెడ్డి తన చానెల్లో ప్రసారం చేసిన వ్యాఖ్యలను సభ్య సమాజం ఖడిస్తున్నట్లు వారు తెలిపారు. అనుచిత చర్యలకు పాల్పడుతున్న సాక్షి పత్రిక, చానెల్‌ను ప్రజలు బహిష్కరించాలని, అనుమతులు తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళలను వేశ్య అనే పదాన్ని శాశ్వతంగా తొలగించి, మహిళలపై దూషణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ప్రత్యేక చట్టం చేయాలని తెలిపారు. మహిళలను కించపరిచే విదంగా ప్రసారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యం వైస్ భారతి, జగన్ రెడ్డి బహిరంగంగా మహిళలకు క్షమాపన చెప్పాలని తహసీల్దార్ సురేస్ నాయక్ వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో కూటమి మహిళలు పాల్గొన్నారు.



వినుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న కూటమి మహిళలు

చిలకలూరిపేటలో తెలుగు మహిళల భారీ ర్యాలీ

చిలకలూరిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచితంగా సాక్షి మీడియాలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చిలకలూరిపేటలో మంగళవారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో స్థానిక మహిళా సంఘాలు, యువజన సంఘాలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, సామాజిక కార్యకర్తలతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నరసరావుపేట సెంటర్‌లో రైతు బజార్ వద్ద ప్రారంభమైన ర్యాలీ గడియారం స్తంభం వరకు ప్లకార్డులు చేతబూని, నల్ల బెలూన్‌లతో నిరసన నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. గడియారస్తంభం వద్ద జగన్, కృష్ణంరావుల ఫొటోలను తగులబెట్టారు. ర్యాలీ ముగింపు సందర్భంగా టీడీపీ మహిళా విభాగం నేతలు మిరియాల రత్నకుమారి, పోపూరి లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం మొత్తం సమాజాన్ని తక్కువగా చూపే చర్య అన్నారు. వారిని సమర్థించిన సజ్జల రామకృష్ణ రెడ్డి, చానెల్ నిర్వాహకురాలు భారతి రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, భారతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కిరణ్ అనే టీడీపీ సానుభూతిపరుడిపై నిమిషాలలో చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడును చూసి సాక్షి యాజమాన్యం సిగ్గు తెచ్చుకోవాలని, మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన వారిని ఇంకా కాపాడుతున్న సాక్షి యాజమాన్యం వైఖరిని ఖండించారు. తప్పు డు వ్యాఖ్యలు చేసేవారు భయపడేలా చట్టాలు మరింత కఠినతరం చేయాలని వారు డిమాండ్ చేశారు.



చిలకలూరిపేటలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి చిత్రాలను తగలబెడుతున్న కూటమి నేతలు

సచివాలయాల్లో అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలి

● మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ప్రజలకు అందించే సర్వీసులేవీ పెండింగ్‌లో లేకుండా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్నిగ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో సమర్థవంతంగా నిర్వహించాలని, అన్ని సచివాలయాల్లో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9గంటల వరకు సచివాలయ ఉద్యోగులు ప్రజలతో యోగా చేయించి వాటికి సంబంధించిన ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు, స్థలాల మ్యాపింగ్, అభ్యర్థుల మ్యాపింగ్ తదితర అంశాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో ఇంటిపన్నుల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి యజమానులంతా ఇంటిపన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరు మీన సీతారామయ్య, ఈవోపీఆర్డీ పి.సుగుణ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ కోవిద్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, పక్కన ఎంపీడీవో

పల్నాడు జిల్లా ఫుట్ బాల్ జట్ల ఎంపిక



పల్నాడు జిల్లా బాలుర, బాలికల ఫుట్ బాల్ జట్టు

సత్తెనపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పల్నాడు జిల్లా స్థాయి సీనియర్ బాల బాలికల ఫుట్ బాల్ జట్ల ఎంపిక జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 90మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో అర్హులను జట్టులో ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐఎస్ నాగిరెడ్డి, శ్రీరామిరెడ్డి, అప్పిరెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, శ్రీనివాసరావు, రియాజ్ తదితర పీడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత పీఈటీ ఐఎస్ నాగిరెడ్డిని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యేశ్వరరావు ఘనంగా సన్మానించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడా కారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నూజెండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో 2025 - 26 విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతులు ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో చదివేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కలిగిన విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు దివ్యాంగ పింఛన్ల పరిశీలన

బొల్లాపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో దివ్యాంగ పింఛన్‌లు పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలపై పరిశీలన చేస్తున్నట్లు సచివాలయ సిబ్బంది మల్లేశ్వరరావు తెలిపారు. వెరిఫికేషన్‌కు వెళ్ళేవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ తీసుకొని వెరిఫికేషన్‌కు ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. సచివాలయంలో 50మంది దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్ జరుగుతున్నట్టు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన రేషన్ పంపిణీ

మతుకుమల్లి (శావల్యాపురం) జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దుకాణాలకు రేషన్ సరుకులు సరఫరా చేయడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం పేదలపాలిట శాపంగా మారుతోంది. మండలంలోని మతుకుమల్లిలో రేషన్ షాపునెంబర్ 19కి జూన్ నెలలో గ్రామస్థులకు పంపిణీ చేసేందుకు 80క్వింటాళ్ళు బియ్యం అందజేయాల్సి ఉండగా అధికారులు కేవలం 35క్వింటాళ్ళు మాత్రమే సరఫరా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో డీలర్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి బియ్యం నిల్వల్లో 45క్వింటాళ్ళు తక్కువగా ఉంచి విధులకు రాజీనామా చేయడంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. 6నెలలనుంచి ప్రతినెలా షాపునకు బియ్యం తక్కువగా వస్తుండడంతో కార్డుదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రేషన్ డీలర్ గ్రామపెద్దల సహకారంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో వారు వెంటనే స్పందించి ఈ నెల 5వ తేదీన 45 క్వింటాళ్ళు బియ్యాన్ని మంజూరు చేశారు. బియ్యం మంజూరుచేసి ఆరు రోజులు గడుస్తున్నా వినుకొండ సివిల్ సప్లయి గోడౌన్ డీటీ ఇంతవరకు బియ్యాన్ని షాపునెంబర్-19కి సరఫరా చేయలేదు. అదేమని అడిగితే కూలీలు అందుబాటులో లేరని, వాహనాలు దొరకడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ పంపిణీకి మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో కార్డుదారులలో ఆందోళన నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి బియ్యాన్ని సరఫరా చేయాలని కోరుతున్నారు.

నాటు సారా నిర్మూలనపై అవగాహన

బొల్లాపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది తండా, బ్రిడ్జి తండా, బోడిపాలెం తండా, గండి గనుముల గ్రామాల్లో నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను పల్నాడు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి డీ వెంకటేశ్వర్లు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానిత గ్రామాల్లో దాడులు చేయటం, నవోదయ- 2.0 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామాల్లో నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలతో పాటు అనుమానితులపై నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.



శావల్యాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో రవీంద్ర రత్నాకర్

దోమల నివారణపై దృష్టి సారించాలి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

శావల్యాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమవుతున్నందున గ్రామాల్లో దోమల నివారణపై ప్రజలంతా ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. శావల్యాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ల్యాబ్ పరీక్షలు, ఓపీలు, మందుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. డీఎంవో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్‌వ్యాధులపై ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని, నిత్యం గ్రామాల్లో పర్యటించి జ్వరాల సర్వే నిర్వహించి అనుమానితులను వెంటనే పీహెచ్‌సీకి తరలించి వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ప్రజలకు దోమల నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దోమలు పెరగకుండా, దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, తప్పకుండా దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ లక్ష్మీప్రసన్న, ల్యాబ్ టెక్నీషియన్‌లు సీతారామయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీల్లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

పారిశుధ్య పనులు వేగవంతం

వినుకొండ టౌన్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు పట్టణంలోని డ్రెయిన్లలో పూడిక తీసే పనులను వేగవంతం చేశారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మంగళవారం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన డ్రైనేజీలను శుభ్రపరచాలని, రహదారులు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా నివారించేందుకు చర్యలు చేపట్టాలని చీఫ్ విప్ జీవీ ఆదేశించారని కమిషనర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15వ ఆర్థికశాఖ నిధులతో డ్రెయిన్లను శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



సాతులూరులో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుల్లారావు

వైభవంగా దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. కాగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే పుల్లారావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజారులు ఆయనకు ఆశీర్వాదం అందజేశారు. సుమారు ఐదువేల మందికి నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆయన వెంట దేవాలయ కమిటీ సభ్యులు ఐనవోలు శివ నాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, పార్టీ నాయకులు ఎన్.సదాశివరావు, బీ సత్యనారాయణ, జే మదన్, కమ్మ పెదశ్రీనివాసరావు, జంపని వసంతరావు, శివ కోటేశ్వరరావు, శివ నాగేశ్వరరావు, సీఐ సుబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గోగులపాడులో నివేశన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవింద బాబు, ఆర్డీవో మధులత, తహసీల్దార్ నిర్మల

నివేశన స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

రొంపిచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడులో గతంలో పేదలకు పంపిణీ చేసేందుకు మంజూరైన స్థలాన్ని ఆర్డీవో మధులత, ఎమ్మెల్యే అరవిందబాబు, తహసీల్దార్ బండి నిర్మల మంగళవారం పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్థలంపై స్థానికులు కోర్టును ఆశ్రయించారు. ఇటీవల ఎమ్మెల్యే అరవిందబాబు గోగులపాడు గ్రామ టీడీపీ నాయకులతో కలసి నివేశన స్థలాల పంపిణీ విషయపై ఆర్డీవోను కలిశారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



పీఎండీఎస్ విత్తనాల కిట్లను రైతుకు అందజేస్తున్న డీపీఎం అమలకుమారి

అందుబాటులో పీఎండీఎస్ విత్తనాలు

● డీపీఎం అమలకుమారి

యడ్లపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రధాన పంట సాగుకు ముందు చేపట్టే ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)కు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని ఉన్నవలోని నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) షాపును ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్య విధానానికి అవసరమైన కషాయాలు, ఘన జీవామృతం వంటి వాటితోపాటు 30రకాలతో పీఎండీఎస్ విత్తనాల కిట్లు ఈ షాపులో లభిస్తాయన్నారు. తొలకరి వర్షాలు కురవగానే ప్రధాన పంట వేసే ముందు వీటిని పొలంలో చల్లుకోవాలన్నారు. అలా చేయడం వలన వివిధ పంటల వేర్లు భూమిలోపలి పొరల్లో వైవిధ్యం కలిగిన వివిధ రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పిస్తాయని, భూమికి నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. భూమి గుల్లబారడంతోపాటు కర్బన శాతం పెరిగి సారవంతం అవుతుందని, ప్రధాన పంటలకు కావలసిన పోషకాలు సక్రమంగా అందుతాయన్నారు. వీటితోపాటు చీడపీడలు, తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం పెరుగుందని, రసాయన ఎరువుల వినియోగం కూడా బాగా తగ్గుతుందన్నారు. అంతేగాకుండా నవధ్యాన్యపు పంటలతో పశువులకు పోషకాలతో పచ్చిమేత ఉపయోగపడుతుందన్నారు. రైతులందరూ పీఎండీఎస్ విత్తనాలను వేసుకోవాలని సూచించారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి ఉన్నవ కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ బేబిరాణి, ఎన్‌సీఆర్‌పీ స్వాములు పాల్గొన్నారు.

అఘాయిత్యాలపై నిరసన

నరసరావుపేట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై వైసీపీ మహిళా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నరసరావుపేట నియోజకవర్గ వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బొబ్బిలి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గుంటూరు రోడ్డులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి వినతిపత్రం ఇచ్చారు. అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియట్ చదువుతున్న అమ్మాయి హత్యకు గురవటం దారుణం అని మహిళా నాయకురాలు గూడూరు మాణిక్యం అన్నారు. వీటిపై కూటమి ప్రభుత్వం ఏమిచేస్తోందని మహిళా నాయకురాలు మల్లెల అనిలా ప్రశ్నించారు.